క్లుప్తంగా

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఆదినారాయణరెడ్డి

ఐరాల: మండలంలోని బలిజపల్లెలో ఆదివారం సంక్రాంతి పండుగతోపాటు తన మనవరాలు మోక్షశ్రీ పుట్టినరోజు పురస్కరించుకుని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్ బిల్డింగ్ కమిటీ చైర్మన్ ఆదినారాయణరెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రభాకర్ రెడ్డి, మునస్వామిరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి విరాళం



రూ.లక్ష విరాళం ఇస్తున్న రుక్మిణీదేవి

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన రుక్మిణీదేవి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబుకు అందజేశారు. ఆమెకు స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: యాదమరి మండలం 180 కొత్తపల్లెలో సోమవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. 14 కర్ణాటక మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని మద్యం విక్రేత చందు(30)ను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది నాగరాజు,క్రిష్ణయ్య, వెంకటేష్, వీరస్వామి, మమత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పార్కులో సందడి

చిత్తూరు రూరల్: చిత్తూరులోని జింకల పార్కు, గంగినేని పార్కు సోమవారం సాయంత్రం సందడిగా కనిపించింది. సంక్రాంతి పండుగల సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో అందరూ పార్కులో ఉత్సాహంగా గడిపారు. జారుడుబల్ల, ఉయ్యాల, తిరుగుడు బల్లలో గిరగిరా తిరుగుతూ ఉల్లాసంగా కనిపించారు. రాత్రి 7 గంటలకు వరకు కూడా జనంతో కిటకిటలాడింది.

పుష్పపల్లకిలో వీరభద్రస్వామి ఊరేగింపు



చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిధిలోని నరిగపల్లెలో సోమవారం వీరభద్రస్వామిని పుష్పపల్లకిలో ఘనంగా ఊరేగించారు. తొలుత స్వామి వారికి ఆలయం వద్ద విశేష పూజలు చేసి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య బాబు, నాగయ్య, రంగయ్య, ప్రకాష్, హేమాద్రి, వెంకటేష్, నాగేంద్ర బాబు, ప్రభు, నాగరాజ, మురళి, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన గంగమ్మ ఆలయం



అమ్మవారి సేవలో భక్తులు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయకట్టులో ఉన్న ఆరిమాని గంగమ్మ ఆలయానికి భక్తులు సోమవారం పోటెత్తారు. కనుమ పండుగను పురస్కరించుకుని జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎదురొస్తే కుమ్ముడే..!





పౌరుషంగా దూసుకువస్తున్న ఎద్దును నిలువరించేందుకు చూస్తున్న జనం

- కోలాహలంగా కనుమ వేడుకలు
- పశువుల పండుగలో రంకెలేసిన ఎద్దులు
- నిలువరించేందుకు పోటీపడిన యువకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో సోమవారం కనుమ పండుగను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గోమాతలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం ఎద్దులు, కోడెగిత్తలను పరుగులు పెట్టించారు. వీటిని నిలువరించేందుకు యువకులు, పెద్దలు నువ్వానేనా? అనేవిధంగా పోటీ పడ్డారు. మరోవైపు తాళ్లతో కట్టిన ఎద్దులు పౌరుషంగా రంకెలేస్తూ జనం మీదుకు దూసుకుపోయాయి. ఎదురొస్తే కుమ్మేస్తాం..అనే లెవెల్లో అవి ఓ చూపు చూసినా యువకులు తెగించారు. ధైర్యం చేసి, వాటిని నిలువరించే ప్రయత్నంలో కొందరు కిందామీదా పడి అందరి దృష్టిలో పడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు రావడంతో గ్రామంలోని ఇళ్ల మీద సైతం జనసందడితో మారాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈపోటీలను ప్రశాంతంగా నిర్వహించారు.



తాడు కట్టినా తగ్గేదేలే.. పరుగు తీస్తున్న ఎద్దు

ఘనంగా పతంగుల పండుగ



కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని చిత్తూరులో ఆదివారం స్వామి వివేకానంద ఫౌండేషన్ పతంగుల పండుగను ఘనంగా నిర్వహించింది. ముఖ్యఅతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. వారు స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించి కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మాట్లాడారు. పండుగలే ఐక్యతను చాటుతాయన్నారు. చిత్తూరులో సామూహికంగా గాలిపటాలు ఎగురవేసే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కాసేపు ఎమ్మెల్యే గాలిపటాన్ని ఎగుర వేసి ఉత్సాహంగా గడిపారు. అనంతరం స్వామి వివేకానందకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు జయకుమార్, నిర్వాహకులు మాధవరెడ్డి, శరశ్చంద్రశేఖర్, ధరణివేలు, హేమంత్, కవిత శివ తదితరులు పాల్గొన్నారు.

● గ్రామోత్సవం

కాణిపాకం(యాదమరి): మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం రాత్రి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి, పల్లకిలో కొలువుదీర్చి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర మంగళ నీరాజనాలు సమర్పించారు.



పెద్దిరెడ్డికి పరామర్శ

చిత్తూరు కార్పొరేషన్: అన్నమయ్య జిల్లా రాయచోటి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, విద్యుత్, అటవీ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రయాణిస్తున్న కారుకు తృటిలో ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ గోపినాథ్ పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిని సదుంలోని వారి నివాసంలో కలిసి పరామర్శించారు. తనకు ఎలాంటి పెద్దగాయాలు కాలేదని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి చెప్పారు.



పెద్దిరెడ్డిని కలిసిన గోపినాథ్

వైభవంగా గరుడ సేవ



గరుడ వాహనంపై లక్ష్మీనారాయణ స్వామి

ఐరాల: సంక్రాంతి సందర్భంగా మండలంలో పాలకలలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వైభవంగా గరుడసేవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెడ్డివారిపల్లెకు చెందిన ఉభయదారులు సమర్పించిన పట్టువస్త్రాలతోపాటు పుష్పాలతో స్వామి వారికి అర్చకులు అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు.

‘ఆ పని ఖజానా శాఖ అధికారులే చేయాలి’

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఈ కేవైసీ పేరుతో పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేయరాదని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేశవులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్, సెల్ నంబర్ అనుసంధానం పేరిట పెన్షనర్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పింఛను చెల్లింపుల్లో భద్రత నిమిత్తం ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీచేసిందని, పెన్షనర్ల వివరాలు సీఎఫ్ఎంఎస్ ఐడీలో ఉందన్నారు. జిల్లాలో దాదాపు 20 వేల మంది పెన్షనర్లు ఉన్నట్లు చెప్పారు. చాలా మంది అనారోగ్యంతో సతమతమవుతున్నారన్నారు. వైద్య చికిత్స నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్నట్లు చెప్పారు. ఈకేవైసీ కోసం పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఆ ప్రక్రియను ఖజానా శాఖ అధికారులే పూర్తి చేయాలని ఆయన సూచించారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పలమనేరు: నియోజకవర్గంలో సోమవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. పలు గ్రామాల్లో ఆనవాయితీగా ఎద్లమెరవణి ఘనంగా నిర్వహించారు. ఎద్దులను ప్రభలతో అలంకరించి వీధుల్లో పరుగులెత్తించారు. మహిళలు పొంగళ్లు పొంగించారు. పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పట్టణానికి సమీపంలోని మన్నారునాయునిపల్లె విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణుడికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



విశేషాలంకారంలో నిర్వాణ నారాయణుడు

నేడు శెట్టేరిలో గడప గడపకు..

బంగారుపాళెం: మండలంలోని శెట్టేరి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉదయం 9 గంటల నుంచి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొంటారని పార్టీ మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.

నేడు ముగ్గుల పోటీ

పలమనేరు : పట్టణంలోని గంగమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు గంగమ్మ గుడి కమిటీ చైర్మన్ కండల నరేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విజేతలకు ఆలయ కమిటీ తరఫున బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా రేణుకాంబ తిరునాళ్ల





గట్రాళ్లమిట్టలో విశేష అలంకరణలో రేణుకాంబ, బొమ్మసముద్రంలో సీతారాములస్వామి

గుడిపాల: మండలంలోని గట్రాళ్ళమిట్టలో సోమవారం రేణుకాంబ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలాగే బొమ్మసముద్రంలో సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం భక్త జన సందడి నడుమ నిర్వహించారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ విజేత దాసరాపల్లె



విజేత జట్టుకు కప్పు, నగదు బహుమతి ఇస్తున్న కార్తిక్ రెడ్డి

యాదమరి: మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో మూడు రోజులుగా నిర్వహించిన వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌లో దాసరాపల్లె విజేతగా నిలిచింది. మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్స్‌లో సామిరెడ్డిపల్లె జట్టుపై దాసరాపల్లె గెలిచింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు రూ.8888, రూ.4444లతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతటా సంక్రాంతి

సంక్రాంతికి పల్లె హృదయాలు ఉప్పొంగాయి. ఇళ్ల లోగిళ్లు రంగవల్లులతో మురిసాయి. ముత్యాల ముగ్గులు..గొబ్బెమ్మ పూజలు.. సంక్రాంతి శోభను పంచాయి. ఇక పశువుల పండుగలో యువత ఉత్సాహం కట్టలు తెగింది.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండలవ్యాప్తంగా ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిట అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. కుల దేవతలకు, ఆత్మీయుల సమాధుల వద్ద పూజలు చేశారు. పలుచోట్ల ఆటలపోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సోమవారం కనుమ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు తమ పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: చనిపోయిన కుటుంబ పెద్దలకు సంక్రాంతి పండుగ రోజున పలువురు దుస్తులు పెట్టి పూజలు చేశారు. కనుమ పండుగ సందర్భంగా గ్రామాల్లో రైతులు పశువులకు ప్రత్యేక అలంకరించి, పూజలు చేసి, గ్రామ వీధుల్లో వాటిని పరుగులెత్తించారు.

ఐరాలలో..

ఐరాల: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. సోమవారం కనుమ పండగ సందర్భంగా మహిళలు ఇంటి ముందు కళ్లాపి చల్లి, రంగు రంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, పూజలు చేశారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో ఎంపీపీ గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐదు ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి రాములు గుడి వద్ద బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ లావణ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి, సర్పంచ్ సురేష్, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, గాంధీబాబు, పరమేశ్వర రెడ్డి, మధుకుమార్, గణేష్‌రెడ్డి తదితరులతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ పండగను జరుపుకున్నారు. సత్యమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



ఐరాల: రంగురంగుల ముగ్గులో గొబ్బెమ్మ



తవణంపల్లె: ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గీతారెడ్డి



చిత్తూరు రూరల్: పెరుమాళ్లకండ్రిగలో పొంగలి పెట్టి, గొబ్బిపాట పాడుతున్న మహిళలు



తవణంపల్లెలో ఇంటి ముంగిట రంగు రంగులతో వేసిన ముగ్గు, పాడి ఆవు

దిగువమాఘంలో..

తవణంపల్లె: దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.గల్లా కుటుంబసభ్యులు అమరాజ బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్ర నాయుడు, ఎంపీ గల్లా జయదేవ్, డాక్టర్ రమాదేవి, గల్లా సిద్ధార్థ, గల్లా పద్మ, గౌరినేని హర్ష, గౌరినేని విక్రమ్, గల్లా అరుణకుమారి మనువడు యువ హీరో అశోక్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.



సంక్రాంతి సంబరాల్లో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా అశోక్ తదితరులు

కొత్త సినిమాతో మీ ముందుకు వస్తా: గల్లా అశోక్

గల్లా అశోక్ నటించిన హీరో చిత్రానికి ఏడాది పూర్తి కావడంతో రాజన్న పార్కులో కోలాహలంగా వార్షికోత్సవం నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ, దిగువమాఘంలో అవ్వాతాతలతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో ఒక చిత్రంలో నటించనున్నానని, వారం రోజుల్లో ఆ వివరాలు వెల్లడిస్తానన్నారు. మామాయ్య మహేష్‌బాబు ప్రోత్సాహంతోనే తాను సినీ రంగంలోకి ప్రవేశించినట్లు మరోసారి చెప్పుకొచ్చారు. తన మనమడు నటించే సినిమాలను ప్రజలు, అభిమానులు ఆదరించాలని కోరారు. సంబరాల్లో ప్రజలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవంలో స్వామి వారు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం కనుల పండుగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సీతారాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. భక్తులను పసుపు, కుంకుమ, ప్రసాదం పంపిణీ చేశారు. చైర్మన్ వెంకటేషగుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తులు

ముగిసిన ధనుర్మాస పూజలు

ఐరాల: స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు సోమవారం ముగిశాయి. కనుమ పండుగ సందర్భంగా సీతారామలక్ష్మణ సమేత కోదండరామస్వామిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రెన్యూవల్ గడువు పెంచరూ!

పుంగనూరు: పదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకునేలా గడువు పెంచాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రతినిధులు చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ సేతు సోమవారం మదనపల్లెకు వచ్చిన కడప ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆర్జేడీ సానుకూలంగా స్పందించారనివారు పేర్కొన్నారు.